సమ్మె కాలానికి వేతనం చెల్లించాలి : సిఐటియు

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

తమ న్యాయమైన డిమాండ్ల కోసం మున్సిపల్ కార్మికులు చేసిన సమ్మెకు సంబంధించిన వేతనం, పండుగ బోనస్ చెల్లించాలని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు చిట్వేలి రవికుమార్ ఆధ్వర్యంలో బుధవారం నూతనంగా బాధ్యతలు తీసుకున్న మున్సిపల్ కమిషనర్ రాంబాబుకు వినతి పత్రం సమర్పించారు. ముందుగా కమిషనర్‌కు పుష్ప గుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు. కమిషనర్ రాంబాబు వెంటనే స్పందించి కార్మికులకు రావలసిన బకాయిలు పెండింగ్ లేకుండా వారికి చెల్లించాలని అధికారులను ఛాంబర్‌కు పిలిపించుకొని ఆదేశించారు. కార్యక్రమంలో మున్సిపల్ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షులు సిహెచ్ ఓబయ్య, కార్మికులు లక్ష్మీదేవి, ప్రసాద్, రమణ, బాలాజీ పాల్గొన్నారు.

కమిషనర్‌కు పుష్పగుచ్ఛం ఇస్తున్న కార్మికులు

సుపరిపాలన అందించడమే లక్ష్యం

- కలెక్టర్ ఎం.అభిషిక్త్ కిషోర్

ప్రజాశక్తి-రాయచోటి

అన్నమయ్య జిల్లా ప్రజలకు సుపరిపాలన అందించడమే లక్ష్యమని కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించిన ఎం.అభిషిక్త్ కిషోర్ పేర్కొన్నారు. బుధవారం ఉదయం కలెక్టరేట్‌లోని తన ఛాంబర్‌లో కలెక్టర్‌గా ఆయన బాధ్యతలు స్వీకరించారు. బాధ్యతలు స్వీకరించిన అనంతరం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ సొంత రాష్ట్రమైన ఆంధ్రప్రదేశ్‌లో అన్నమయ్య జిల్లా కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించడం ఆనందంగా ఉందని తెలిపారు. ప్రభుత్వం అందించే పథకాలు, ఇతర అభివృద్ధి కార్యక్రమాలను అర్హులైన ప్రతి ఒక్కరికీ అందించడమే లక్ష్యమన్నారు. 'జగనన్నకు చెబుదాం – స్పందన' కార్యక్రమంలో వచ్చే ప్రతి ఫిర్యాదును పరిష్కరించేందుకు తగు చర్యలు తీసుకుంటామన్నారు. ప్రజలకు సుపరిపాలన అందించడంలో జిల్లా యంత్రాంగం అందుబాటులో ఉంటుందన్నారు. ప్రజా ప్రతినిధులు, పాత్రికేయులు, ఎన్‌జిఒలను సమన్వయం చేసుకుని ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ ఫలాలు ప్రజలందరికీ చేరువయ్యేలా చర్యలు తీసుకుంటామన్నారు. ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో ఎన్నికలను స్వేచ్ఛగా, నిష్పక్షపాతంగా నిర్వహించడం తన ప్రాధాన్యతా పనులలో అత్యంత కీలకమని తెలిపారు. అనంతరం, వివిధ శాఖల జిల్లా అధికారులతో తన ఛాంబర్‌లో సమీక్షించి తగు సూచనలు చేశారు. బాధ్యతలు స్వీకరించే ముందు రాయచోటిలోని వీరభద్ర స్వామి ఆలయానికి వెళ్లి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు ఆయన్ను వేదమంత్రాలతో ఆశీర్వదించారు. నూతన జిల్లా కలెక్టర్‌కి కలెక్టరేట్ సిబ్బంది, జిల్లా అధికారులు, తదితరులు పుష్పగుచ్ఛాలు అందించి శుభాకాంక్షలు తెలిపారు.

బాధ్యతలు స్వీకరించిన అనంతరం మీడియాతో మాట్లాడుతున్న కలెక్టర్ కిషోర్

రాయచోటి పట్టణ అభివృద్ధే ధ్యేయం

రూ.2 కోట్ల సుందరీకరణ పనుల ప్రారంభంలో 'గడికోట'

ప్రజాశక్తి - రాయచోటి టౌన్

రాయచోటి పట్టణ అభివృద్ధే తమ ధ్యేయమని ఎమ్మెల్యే శ్రీకాంత్ రెడ్డి అన్నారు. బుధవారం రాయచోటి పట్టణంలో రూ.2 కోట్ల నిధులతో చేపట్టిన సుందరీకరణ పనులను మున్సిపల్ చైర్మన్ ఫయాజ్ బాష, వైస్ చైర్మన్ దశరథ రామిరెడ్డి, ఫయాజుర్ రెహమాన్‌లతో కలసి అయన ప్రారంభించారు. పట్టణంలోని వేంపల్లె క్రాస్ రోడ్డు, చిత్తూరు రహదారి మార్గంలోని రింగ్‌రోడ్డు వద్ద సుందరీకరణ పనులకు భూమి పూజ నిర్వహించి పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ రూ.2. కోట్ల నిధులతో, మున్సిపల్ సహకారంతో టవర్ క్లాక్, 6 సర్కిల్స్‌లలో సుందరీకరణ పనులు ప్రారంభం కావడం హర్షణీయమన్నారు. ఎస్ఎన్ కాలనీ వద్ద రూ.1.15 కోట్లతో టవర్ క్లాక్, అలాగే చిత్తూరు రహదారి మార్గంలోని సర్కిల్, నేతాజీ సర్కిల్, షాదీ ఖానా వద్ద ఉన్న అబ్దుల్ కలాం విగ్రహం వద్దనూ, మాసాపేట– వేంపల్లె సర్కిల్, దిబ్బలబడి సర్కిల్, ఎన్‌జిఒ కాలనీ సర్కిల్‌లలో సుందరీకరణ పనులను చేపడుతున్నామన్నారు. ముఖ్యమంత్రి జగన్ ఆశీస్సులు, ఎంపీ మిథున్‌రెడ్డి సహకారంతో రాయచోటిని జిల్లా కేంద్రంగా చేసుకుని,ఎన్నోఅభివృద్ధి పనులను చేపడుతున్నాయని తెలిపారు. గొప్ప సంకల్ప బలంతో ఈ పనులను చేపడుతున్నామన్నారు. పట్టణంలో చేసిన అభివృద్ధి పనులు కళ్ళకు కట్టినట్లుగా కనపడుతున్నాయన్నారు. గుణ్ణికుంట్ల క్రాస్ రోడ్డు రహదారిని సుందరంగా అభివృద్ధి చేసి స్ట్రీట్ లైట్లు ఏర్పాటు చేశామని పేర్కొన్నారు. సుండుపల్లె రహదారి మార్గంలోని నాలుగు వరుసల రహదారి విస్తరణ పనులు కూడా దాదాపు పూర్తి కావచ్చాయన్నారు. సెంట్రల్ లైటింగ్ పనులను కూడా త్వరలోనే పూర్తి చేస్తామన్నారు. ఎస్.ఆర్ కళ్యాణ మండపం నుంచి అన్నమయ్య సర్కిల్ వరకు 7 కిమీ మేర నాలుగు వరుసల జాతీయ రహదారి మార్గంలో మున్సిపల్ పాలక వర్గం సహకారంతో ఎల్ఇడి లైట్లను ఏర్పాటు చేశామని తెలిపారు. రూ 2.50 లక్షల కోట్ల నిధులను వివిధ సంక్షేమ పథకాల ద్వారా నేరుగా ప్రజలకు అందించిన ఘనత సిఎం జగన్‌కు దక్కుతుందన్నారు. రూ.15 లక్షల నిధులతో గుంతబజార్‌లో త్వరలో డ్రెయినేజీ నిర్మాణాలు చేపడతామన్నారు. కార్యక్రమంలో మైనారిటీ జిల్లా అధ్యక్షుడు బేపారి మహమ్మద్ ఖాన్, సుగవాసి ఈశ్వర్ ప్రసాద్, సుగవాసి శ్యామ్, జి ఎం.డి ఇమ్రాన్, జిఎండి ఇర్షాద్, కొలిమి చాన్ బాష, ఫయాజ్ అహమ్మద్, గౌస్ ఖాన్, అల్తాఫ్, వాల్మీకి సంఘ అధ్యక్షుడు గువ్వల బుజ్జిబాబు,యువజన విభాగపు అధ్యక్షుడు కొత్తపల్లె ఇంతియాజ్, ముదిరాజ్ యువసేన సంఘ జిల్లా అధ్యక్షులు విక్కీ దేవేంద్ర, జావీద్, అమీర్, ఖాదర్‌వలీ, ఖాదర్ హుసేన్, అజ్మతుల్లా, భుట్టో, అల్లా బకష్, చాన్, షబ్బీర్, జహీర్, మున్సిపల్ ఎఇ కృష్ణారెడ్డి, పబ్లిక్ అండ్ హెల్త్ ఎఇ కావ్య,మున్సిపల్ ఆర్ఐ మల్లికార్జున అధికారులు పాల్గొన్నారు.

సుందరీకరణ పనుల ప్రారంభంలో ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి

ఉత్కంఠ భరితంగా బాలికల కబడ్డీ పోటీలు

పోటీలో తలపడుతున్న తమిళనాడు, గుజరాత్ క్రీడాకారులు

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

అండర్14 జాతీయ స్థాయి బాలికల కబడ్డీ పోటీలు ఇన్ఫాంట్ జీసస్ హైస్కూల్‌లో బుధవారం క్వార్టర్ ఫైనల్ మ్యాచ్‌లు ఉత్కంఠ భరితంగా సాగాయి. నాక్ అవుట్ మ్యాచులు కావడం చేత అన్ని జట్లు పోరాట పటిమను ప్రదర్శించాయి. ఛత్తీస్‌గఢ్, పశ్చిమ బెంగాల్ జట్లు మధ్య క్వార్టర్ ఫైనల్ మ్యాచ్‌లు ప్రారంభమయ్యాయి. ఈ మ్యాచ్‌లో 41 పాయింట్ల తేడాతో ఛత్తీస్‌గఢ్ గెలుపొందింది. ఉత్తరప్రదేశ్ హిమాచల్‌ప్రదేశ్‌ల మధ్య ఉత్కంఠ భరితంగా జరిగిన పోటీల్లో 12 పాయింట్ల తేడాతో ఉత్తరప్రదేశ్ విజయం సాధించింది. తమిళనాడు, గుజరాత్‌ల మధ్య జరిగిన పోటీల్లో 16 పాయింట్ల తేడాతో తమిళనాడు గెలుపొందింది. విద్యా భారతి జట్టుపై హర్యానా 37 పాయింట్లతో గెలిచింది. ఛత్తీస్‌గఢ్, ఉత్తరప్రదేశ్ జట్ల మధ్య జరిగిన పోటీలో 20 పాయింట్ల తేడాతో ఉత్తరప్రదేశ్ విజయం సాధించి సెమీఫైనల్‌కు చేరుకుంది. 28 పాయింట్ల తేడాతో తమిళనాడుపై హర్యానా విజయం సాధించి సెమీఫైనల్‌కు చేరుకుంది. పంజాబ్‌పైన మహారాష్ట్ర 25 పాయింట్ల తేడాతో గెలుపొంది సెమీఫైనల్‌కు చేరుకుంది. ఢిల్లీపై రాజస్థాన్ జట్టు 22 పాయింట్లతో విజయం సాధించి సెమీ ఫైనల్‌కు చేరుకుంది. సెమీ ఫైనల్‌కు చేరుకున్న జట్లు గురువారం ఉదయం 8 గంటలకు పోటీలో తలపడనున్నాయి. 10 గంటలకు ఫైనల్ మ్యాచ్ ప్రారంభమవుతాయి. ఇందు కోసం నార్వాహకులు ఏర్పాట్లను సిద్ధం చేశారు. అంతకు ముందు క్రీడలు ప్రారంభం సదంర్భంగా ఆర్ఐపి భానుమూర్తి రాజు మాట్లాడుతూ విద్యార్థులు చదువుపైనే కాకుండా క్రీడల్లో రాణించాలని సూచించారు. కార్యక్రమంలో నిర్వాహకులు పాల్గొన్నారు.

రూ.40 కోట్లతో గుంజన నదికి రక్షణ గోడ

- దశాబ్దాల సమస్యకు పరిష్కారం : కొరముట్ల

శిలఫలకాన్ని ఆవిష్కరిస్తున్న కొరముట్ల శ్రీనివాసులు

ప్రజాశక్తి-రైల్వేకోడూరు

దశాబ్దాల సమస్యగా ఉన్న రైల్వేకోడూరు పట్టణంలోని నరసరాంపేట, గాండ్లవీధి, ధర్మాపురం పరిసర ప్రాంతాల మీదుగా ఉన్న గుంజన నదీ పరివాహక ప్రాంతంలో సుమారు రూ.40 కోట్ల వ్యయంతో నిర్మించనున్న రక్షణ గోడకు ప్రభుత్వ విప్ కొరముట్ల శ్రీనివాసులు బుధవారం భూమిపూజ చేశారు. ఇరిగేషన్ శాఖ అధికారులు, శ్రీనివాస కన్స్ట్రక్షన్స్ అధినేత క్లాస్ వన్ కాంట్రాక్టర్ పాటూరి శ్రీనివాసులరెడ్డి ఆధ్వర్యంలో భూమిపూజ కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం ప్రధాన రహదారి ప్రక్కన శిలాఫలకాన్ని కొరముట్ల ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కొరముట్ల మాట్లాడుతూ గుంజన నది పరివాహక ప్రాంతాల ప్రజల సమస్యను రాజంపేట ఎంపీ పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి సహకారంతో ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లి రక్షణ గోడ నిర్మాణానికి నిధులు మంజూరు చేయించామని పేర్కొన్నారు. ఈ రక్షణ గోడ నిర్మాణం పూర్తయితే వరదల సమయంలో నది పరివాహక ప్రాంతంలో ఉన్న ప్రజలకు ఎలాంటి సమస్య ఉండదన్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు కొల్లం గంగిరెడ్డి, వైస్ ఎంపిపి రామిరెడ్డి ధ్వజారెడ్డి, జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ సుకుమార్‌రెడ్డి, చిట్వేలు మండల కన్వీనర్ చెవు శ్రీనివాసరెడ్డి, వైసిపి రాష్ట్ర ప్రచార కార్యదర్శి సిడి నాగేంద్ర యాదవ్, మార్కెట్ కమిటీ చైర్మన్ సుబ్బరామరాజు, సీనియర్ నాయకుల ఎల్వి మోహన్‌రెడ్డి, వైసిపి నాయకులు వడ్డీ అన్నపూర్ణ, సునీల్ కుమార్, మందల నాగేంద్ర, ఉప సర్పంచ్ తోట శివసాయి, జిల్లా టూరిజం డైరెక్టర్ సుధాకర్ రాజు, జడ్‌పిటిసి రత్నమ్మ, ఇరిగేషన్ శాఖ ఎస్ఇ వెంకట్రామయ్య, ఇఇ కృష్ణమూర్తి, డిఇ చంగల్రాయుడు, ఎఇ రాజన్న, జిల్లా కో–ఆప్షన్ సభ్యులు అన్వర్‌బాష, మైనారిటీ కార్పొరేషన్ డైరెక్టర్ ముజీబ్, రమేష్, మాజీ ఎంపిపి తమ్మిద తిరుపాలు, ఎంపిటిసిలు జనార్దన్ రాజు, మల్లికార్జున, మహేశ్వర్ రెడ్డి, పుష్పలత, సర్పంచ్‌లు, శ్రీరామ వినోద్, హరికృష్ణారెడ్డి, శివయ్య, సుబ్రమణ్యం రాజు, రామకృష్ణ, దార్ల చంద్రశేఖర్ పాల్గొన్నారు.

సుదీర్ఘకాలం సేవలందించడం అభినందనీయం : ఎస్‌పి

ప్రజాశక్తి - రాయచోటి టౌన్

సుదీర్ఘకాలం పోలీస్ శాఖకు సేవలు అందించి విరమణ పొందడం అభినందనీయమని అన్నమయ్య జిల్లా ఎస్‌పి బి.కృష్ణారావు పేర్కొన్నారు. బుధవారం జిల్లా ప్రధాన కార్యాలయంలో ఉద్యోగ విరమణ పొందిన ఎస్ఐ జైనుల్లా అబెద్దీన్, ఎఎస్ఐ రమేష్‌బాబును ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఎస్‌పి మాట్లాడుతూ 34 సంవత్సరాలుపైగా సంతోషకరంగా సుదీర్ఘకాలం పోలీస్ శాఖకు ఉన్నతమైన సేవలను అందించి అందరికి ఆదర్శవంతులుగా నిలిచారని ఇలాంటి సేవ చేయడం చిన్న విషయం కాదని చెప్పారు. తన జీవితంలో ఎన్నో రకాలైన సంఘటనలు ఎదుర్కొని నిలబడి, ఒక వైపు పోలీస్ ఉద్యోగాన్ని, మరోవైపు వ్యక్తిగత జీవితాన్ని బెలెన్స్ చేయడం గొప్ప విషయమన్నారు. విరమణ తరువాత జీవితంలో కొత్త అధ్యాయంలోకి అడుగుపెడుతున్నారని, వారికి హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. విరమణ పొందిన తరువాత ఏదైనా సమస్యలు వస్తే డిపార్టుమెంటు తలుపులు ఎప్పుడూ తెరిచే ఉంటాయని సమస్యలను పరిష్కరించడంలో పోలీస్ శాఖ ముందు ఉంటుందని చెప్పారు. కార్యక్రమంలో ఎస్‌బి సిఐ టి.బి. సత్యనారాయణ, దిశ సిఐ చంద్రశేఖర్, డిసి ఆర్‌బి సిఐ వరప్రసాద్, ఎస్ఐ బాలకృష్ణ, పోలీసు అధికారులు, కుటుంబ సభ్యులు, సన్నిహితులు పాల్గొన్నారు.

ఉద్యోగ విరమణ పొందిన వారిని సన్మానిస్తున్న ఎస్‌పి కృష్ణారావు

నూతన కలెక్టర్‌ను కలిసిన ఎమ్మెల్యే

ప్రజాశక్తి - రాయచోటి టౌన్

రాయచోటి అన్నమయ్య జిల్లా నూతన కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించిన ఎం.అభిశిక్త్ కిషోర్‌ను ఎమ్మెల్యే శ్రీకాంత్ రెడ్డి కలిసి శుభాకాంక్షలు తెలిపారు. బుధవారం సాయంత్రం కలెక్టర్ కార్యాలయంలో ఎమ్మెల్యే శ్రీకాంత్ రెడ్డి కలెక్టర్‌ను కలిశారు. సంక్షేమ, అభివృద్ధి పథకాలను అర్హులైన ప్రజలకు అందించే విషయంలో తాము పూర్తిగా సహకారం అందిస్తామని, రాయచోటి నియోజక వర్గంతో పాటు జిల్లా అభివృద్ధిని సమిష్టి కృషితో సాదిద్దామని నూతన కలెక్టర్‌కు శ్రీకాంత్ రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా పలు అభివృద్ధి కార్యక్రమాలపై వారు చర్చించారు.

'గురుకులం'లో ప్రవేశాలకు దరఖాస్తులు

ప్రజాశక్తి-రామాపురం

2024–25 విద్యా సంవత్సరంలో సాంఘిక సంక్షేమశాఖ డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ పాఠశాల కళాశాలలో ప్రవేశానికి ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకోవాలని ప్రిన్సిపల్ వరప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. ఐదవ తరగతి ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం ఎంపిసి, బైపిసి గ్రూపులలో చేరాలనుకునే అన్నమయ్య, వైఎస్ఆర్ కడప జిల్లాలకు చెందిన విద్యార్థులు www. ap bragcet. apcfsss. In వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకో వాలన్నారు. దరఖాస్తులు ఈనెల 23 వరకు ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవాలన్నారు. ప్రవేశ పరీక్ష మార్చి10న నిర్వహిస్తారన్నారు.

పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలి

ప్రజాశక్తి - వీరబల్లి

పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని ఎన్ఎస్ఎస్ ముగింపు కార్యక్రమంలో ప్రోగ్రాం ఆఫీసర్ రఘురామయ్య అన్నారు. బుధవారం మండలంలోని జూనియర్ కళాశాల విద్యార్థులు ఎన్ఎస్ఎస్ స్పెషల్ క్యాంపులో భాగంగా ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ ఆధ్వర్యంలో దత్తత గ్రామమైన మంగళపల్లిలో నిర్వంచారు. ఈ సందర్భంగా ఎంపిపి పాఠశాలలో పరిసరాలను శుభ్రపరిచారు. అనంతరం ముగింపు కార్యక్రమంలో ఉత్తమ వాలంటీర్లకు కానుకలు మిగతా వారికి సర్టిఫికెట్లను అందజేశారు. ఈ సందర్భంగా పిఓ రఘురామయ్య మాట్లాడుతూ ఇలాంటి కార్యక్రమాల ద్వారా విద్యార్థులు సేవా గుణాన్ని అలవర్చుకుంటారన్నారు. అందరితో కలిసి మెలిసి ఉంటూ సమాజానికి తమవంతుగా సేవ చేసే అవకాశం లభిస్తుందని చెప్పారు. కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు రామనారాయణరెడ్డి భాస్కర్ చంద్రశేఖర్ రెడ్డి రాధాకృష్ణ రమేష్ రాజు వేణుగోపాల్ పాల్గొన్నారు.

సర్టిఫికెట్లు అందజేస్తున్న రఘురామయ్య

టిబి వ్యాధి గ్రస్తులకు పౌష్టికాహారం పంపిణీ

ప్రజాశక్తి-వాల్మీకిపురం

స్థానిక ప్రభుత్వాసుపత్రిలో బుధవారం ప్రధాన మంత్రి టిబి ముక్త భారత్ పోషన్ మిత్ర కార్యక్రమంలో భాగంగా టిబి వ్యాధిగ్రస్తులకు పౌష్టికాహారంను పంపిణీ చేసినట్లు స్థానిక ప్రభుత్వాసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఫైరోజా బేగం తెలిపారు. బుధవారం స్థానిక ప్రభుత్వాసుపత్రి ఆవరణంలో ఆరు నెలలకు సరిపడే రూ.700లు విలువ చేసే పౌష్టికాహారంను టిబి వ్యాధిగ్రస్తులకు పంపిణీ చేశారు. కార్యక్రంలో టిబి యూనిట్ సిబ్బంది నాగిరెడ్డి, క్రిష్ణమూర్తి, మురళి, ఎంఎల్‌హెచ్‌పిలు అమృత, గంగరత్న పాల్గొన్నారు.

విద్యార్థులతో మాట్లాడుతున్న ప్రిన్సిపల్ యువరాజ్

'మిట్స్'లో సక్సెస్ మైండ్ సెట్‌పై అవగాహన సదస్సు

ప్రజాశక్తి-మదనపల్లి : మిట్స్ ఇంజినీరింగ్ కళాశాలలో కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్(డేటా సైన్స్) వారు సక్సెస్ మైండ్ సెట్‌పై సెమినార్‌ను విద్యార్థులకు నిర్వహించినట్లు ప్రిన్సిపల్ డాక్టర్ యువరాజ్ తెలిపారు. ఈ కార్యక్రమానికి రిసోర్స్ పర్సన్‌గా బెంగుళూరుకు చెందిన రావూరి టెక్ ప్రయివేట్ లిమిటెడ్ సిఇఒ వినోద్ కుమార్ పాల్గొన్న ఆయన మాట్లాడుతూ విజయవంతమైన వ్యక్తులు జీవితంలో విజయం సాధించడానికి తగినంత అవకాశాలు ఉన్నాయని ఎల్లప్పుడూ నమ్ముతారన్నారు. విద్యార్థులు సమృద్ధి మనస్తత్వాన్ని అలవాటు చేసుకుంటే, సరిపోని వాటి గురించి మీరు చింతించాల్సిన అవసరం ఉండదని తెలిపారు. ప్రతికూల పరిస్థితులలో, మనుగడ, అభివృద్ధి చెందడం మధ్య వ్యత్యాసం తరచుగా మీ మనస్తత్వానికి వస్తుంది. ప్రతిఒక్కరు జీవితంలో సవాళ్లు, ఎదురుదెబ్బలను ఎలా ఎందురుకోవాలో తెలుసుకోవాలని, సమస్య వచ్చినప్పుడు అధైర్య పడకుండా ముందుకు వెళ్లాలని, చెడు ఆలోచనలు చేయకుండా మనకు విజయానికి చేరుకొనుటకు ఆలోచలను చేయాలని పేర్కొన్నారు. విద్యార్థులు ఒత్తిళ్లకు లోనవకుండా, ఇష్టపడి చదివి ఉన్నత స్థాయిలో ఉండాలన్నారు. మనం చదవే ఏ చదువైన మన భవిష్యత్‌కు ఉపయోగపడుతుందని, ఇది మంచిది, ఇది చెడ్డది అని ఏది ఉండదని, మనం చదివే చదువు మన భవిష్యత్తుకు ఉపయోగ పడేలా మనమే అలవర్చుకోవాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ రామనాథన్, విభాగాధిపతి డాక్టర్ కుసుమ పాల్గొన్నారు.

పేదలకు వరం సిఎం సహాయనిధి : 'చింతల'

ప్రజాశక్తి-వాల్మీకిపురం: ప్రజల ఆరోగ్యమే ప్రభుత్వ లక్ష్యమని పీలేరు ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి అన్నారు. బుధవారం స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో సిఎం సహాయ నిధి కింద 15 మందికి మంజూరైన రూ.18.77 లక్షలు చెక్కులను ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి చేతుల మీదుగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే చింతల మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్మోహన్ రెడ్డి నిరంతరం ప్రజల ఆరోగ్యం కృషి చేస్తున్నారని, ఆరోగ్యశ్రీ అందని వారికి సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా నగదును అందిస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



చెక్కులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే చింతల

ఇండియా, ఇంగ్లాండ్ క్రికెట్ టెస్ట్ మ్యాచ్‌కు స్కోరర్‌గా రామకృష్ణ ఎంపిక

ప్రజాశక్తి-వాల్మీకిపురం

ఫిబ్రవరి 2 నుండి 6వ తేదీ వరకు విశాఖపట్నంలో ఇండియా, ఇంగ్లాండ్ మధ్య జరిగే టెస్ట్ క్రికెట్ మ్యాచ్‌కి స్కోరర్‌గా వాల్మీకిపురం క్రికెట్ క్లబ్ సభ్యులు రామకృష్ణ ఎంపికైనట్లు విసిస క్లబ్ ప్రెసిడెంట్ శ్రీధర్ కుమార్ తెలిపారు. రామకృష్ణ మొదట క్లబ్ క్రీడాకారుడిగా, స్కోరర్‌గా ఉన్నారని, ఆరేళ్ల తరువాత ఇండియా, ఇంగ్లాండ్ టెస్ట్ మ్యాచ్‌కి ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ ప్యానల్ నుండి అవకాశం లభించడం చాలా సంతోషంగా ఉందన్నారు.

విద్యార్థుల భవిష్యత్తుకు బంగారు బాట

ప్రజాశక్తి-వాల్మీకిపురం

సిఎం వైఎస్ జగన్మోహన్ రెడ్డి విద్యా బోధనలో విప్లవాత్మక మార్పులను తీసుకొచ్చి విద్యార్థుల భవిష్యత్తుకు బంగారు బాట వేశారని మాజీ జడ్పీటీసీ చింతల శివానందరెడ్డి అన్నారు. బుధవారం మండలంలోని చింతపర్తి జడ్పీ ఉన్నత పాఠశాలలో ఎనిమిదవ తరగతి చదువుతున్న 73 మంది విద్యార్థులకు ట్యాబ్‌లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాడు నేడు పథకం ద్వారా ప్రభుత్వ పాఠశాలలను అభివృద్ధి చేసిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డిదేనన్నారు. కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సదస్సును విజయవంతం చేయాలి : బిఎస్‌పి

ప్రజాశక్తి- రాయచోటి : మదనపల్లిలో ఈనెల 3న నిర్వహించబోయే బహుజన రాజ్యాధికారి సదస్సు విజయవంతం చేయాలని బిఎస్‌పి జిల్లా అధ్యక్షుడు అబ్బవరం యుగంధర్ పేర్కొన్నారు. బుధవారం స్థానిక అంబేద్కర్‌ఫెక్లీ వద్ద కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బిఎస్‌పి రాష్ట్ర ఉపాధ్యక్షుడు బందెల గౌతం కుమార్ అధ్యక్షత వహిస్తారన్నారు. రాజ్యసభ సభ్యులు రాంజీ గౌతమ్, రాష్ట్ర అధ్యక్షులు పరంజ్యోతి ముఖ్యఅతిథిలుగా హాజరవుతారన్నారు. శనివారం సిఎస్ఐ జెసిఎం కమ్యూనిటీ హాల్‌లో నిర్వహిస్తారని తెలిపారు. కార్యక్రమానికి అందరూ హాజరై విజయవంతం చేయాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో పట్టణ ప్రముఖ న్యాయవాది రమణ, రాయచోటి బహుజన నాయకులు, బహుజన ప్రజాగళం నాయకులు అబ్బవరం నాగేశ్వర్, ఎర్ర నాగుల నరసింహులు పాల్గొన్నారు.

పోస్టర్ ఆవిష్కరిస్తున్న బిఎస్‌పి నాయకులు

బాధితుడికి విరాళం అందజేస్తున్న సాయి వికాస్‌రెడ్డి

బాధితుడికి రూ.50 వేల విరాళం

ప్రజాశక్తి-పుల్లంపేట

మండల పరిధిలోని ఆర్.గొల్లపల్లి గ్రామానికి చెందిన కృష్ణం శివకుమార్ యాదవ్‌కి మూడు రోజుల క్రితం రైల్వేకోడూరు పరిసర ప్రాంతాల్లో లారీ ఢీకొట్టింది. ప్రస్తుతం అతని పరిస్థితి చాలా సీరియస్‌గా ఉందని కుటుంబ సభ్యులు తెలిపారు. రేణిగుంట సమీపంలోని అమర హాస్పిటల్‌లో కోమాలో చావు బతుకుల మధ్య కొట్టుమిట్టాడుతున్న అతనికి ప్రథమ చికిత్స నిమిత్తం సుమారు రూ.ఐదు నుంచి రూ.ఏడు లక్షల వరకు ఖర్చు అవుతుందని డాక్టర్లు కుటుంబ సభ్యులకు వెల్లడించారు. శివ కుమార్‌కి వివాహం జరిగి నెల రోజులు కూడా పూర్తికాలేదు. అతన్ని ఇలాంటి స్థితిలో చూసి అతని భార్య కన్నీరు మున్నేరుగా విలపిస్తోంది. మేకలు మేపుకొని కుటుంబ జీవనం సాగిస్తున్న శివకుమార్ ఆర్థిక స్తోమత అంతంతమాత్రంగానే ఉంది. తన భర్తను ఎవరైనా బాధితులు ఆదుకుంటారా అని ధీనంగా ఎదురుచూస్తున్నారు. ఈ విషయం తెలుసుకున్న ముక్కా రూపానందరెడ్డి ఫౌండేషన్ అధినేత ముక్కా రూపానందరెడ్డి తనయుడు ముక్కా సాయి వికాస్‌రెడ్డి బుధవారం అమర ఆస్పత్రికి వెళ్లి తమ ఫౌండేషన్ తరపున రూ.50 వేల ఆర్థిక సహాయాన్ని కుటుంబ సభ్యులకు అందజేశారు. కార్యక్రమంలో బత్తన వేణుగోపాల్‌రెడ్డి, ఇరగన బోయిన నాగేశ్వరరావు, వెంకటసుబ్బారెడ్డి, రెడ్డివిజయ్, సింగమాల రెడ్డయ్య, ముక్కావారిపల్లి సర్పంచ్ అరవ శ్రీధర్, రమణ రాజు, నాగేంద్ర పాల్గొన్నారు.

మున్సిపల్ కమిషనర్‌గా పి.శ్రీనివాసరావు బాధ్యతలు

ప్రజాశక్తి - రాయచోటి టౌన్

రాయచోటి మున్సిపల్ కమిషనర్‌గా పి.శ్రీనివాసరావు బుధవారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ పనిచేసిన మున్సిపల్ కమిషనర్ గంగాప్రసాద్ బదిలీపై వెళ్లారు. శ్రీనివాసరావు గతంలో మంగళగిరి తాడేపల్లి కార్పొరేషన్‌లో విధులు నిర్వర్తిస్తూ బదిలీపై రాయచోటి మున్సిపాలిటీకి వచ్చారు. కమిషనర్ ఛాంబర్‌లో బాధ్యతలు తీసుకున్న అనంతరం మున్సిపల్ అధికారులు, సిబ్బంది పుష్పగుచ్ఛాలతో స్వాగతం పలికారు. సందర్భంగా ఆయన మాట్లాడుతూ సిబ్బంది సహకారంతో పట్టణ అభివృద్ధి, పారిశుధ్యం మెరుగుకు శక్తి వంచన లేకుండా కృషి చేస్తానుని తెలిపారు. పట్టణ అభివృద్ధికి ప్రజలందరూ సహకరించాలని కోరారు. కార్యక్రమంలో మున్సిపల్ అధికారులు, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

కమిషనర్‌ను సన్మానిస్తున్న ఉద్యోగులు, సిబ్బంది

కుష్టు వ్యాధిపై అవగాహన కల్పిస్తున్న వైద్యులు

కుష్టు వ్యాధిపై అవగాహన అవసరం

ప్రజాశక్తి- కలకడ

కుష్టు వ్యాధిపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని వైద్యాధికారి ఎం.వి.కిషోర్ కుమార్‌రెడ్డి సూచించారు. మండలంలోని ఎర్రకోటపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్యాధికారి ఎంవి కిషోర్ కుమార్ రెడ్డి గారి ఆధ్వర్యంలో ముడియంవారిపల్లి హైస్కూల్‌లో గ్రామ సర్పంచ్ బి.శాంతమ్మ అధ్యక్షతన స్పర్శ కుష్ఠి వ్యాధి అవగాహన కార్యక్రమం జరిగినది. ఈ కార్యక్రమం ఉద్దేశించి సర్పంచ్ గారు మాట్లాడుతూ వైద్య ఆరోగ్యశాఖ ఈ స్పర్శ లెప్రసి ప్రోగ్రాంపై సంవత్సరమునకు రెండు పర్యాయాలు గ్రామములో అన్ని గృహాలను సందర్శించి సర్వేలు నిర్వహిస్తారని వైద్య శాఖను కొనియాడారు. చేతి వేళ్ళు ముడుచుకుపోవడం కంటి చూపులో పించడం, శరీరంపై స్పర్శ లేని మచ్చలు ఉండటం అలాంటి వాటిని గుర్తించి వైద్య శాఖ వారికి తెలియజేస్తే ఒక సంవత్సరం పాటు ఉచిత మందులు సప్లై చేస్తారని సర్పంచ్ బి.శాంతమ్మ గారు తెలిపారు. వైద్యాధికారి మాట్లాడుతూ ఈ స్పర్శ లేని మచ్చలు మైకో బ్యాక్టీరియా లెప్రసీ వల్ల వస్తుందని స్పర్శ లేని మచ్చలు ఉండటం వలన శరీరంలోనే నరాలను డామేజ్ చేసి చేతి వేళ్ళు కాలి వేళ్ళు వంకర పోతాయని దీనివల్ల అంగవైకల్యం వస్తుందని తెలిపారు. ఈ స్పర్శ లేని పొడలు ఉండటం వలన పాదాల్లో బొబ్బలు రేగి కాళ్లు పుండ్లుగా మారి వ్యాధి మరింత పెరుగుతుంది. ఈ స్పర్శ లేని పొడలను ఎంత తొందరగా గుర్తిస్తే అంత తొందరగా ప్రతి ఒక్కరూ అంగవైకల్యం నుండి బయటపడవచ్చును. ఈ స్పర్శ ప్రోగ్రాం జనవరి 30వ తేదీ నుండి ఫిబ్రవరి 13 వరకు ప్రతి గ్రామ పంచాయతీలలో గ్రామ సర్పంచి ఆధ్వర్యంలో జరుగుతుందని వైద్యాధికారి గారు తెలిపారు. ఈ కార్యక్రమంలో హెడ్ మాస్టర్ ఎన్ శివప్రసాద్, ఎంపిహెచ్ఇఒ జి.జయరామయ్య, హెల్త్ సూపర్వైజర్ ఎం.వెంకటేశ్వరరావు, ఎంఎల్‌హెచ్‌పి కె.కనకమ్మ, ఆరోగ్య కార్యకర్త జె.భాగ్యమ్మ, ఉపాధ్యాయులు పి.శ్రీనివాసరావు. ఎస్.నజీర్ అహ్మద్ లిఖిత్, అంగన్వాడీ కార్యకర్త స్వర్ణలత, ఆశా కార్యకర్త షేక్ గౌసబి పాల్గొన్నారు.

కాంగ్రెస్ అభ్యర్థిగా రెడ్డిసాహెబ్ దరఖాస్తు

ప్రజాశక్తి-మదనపల్లి

కాంగ్రెస్ పార్టీ తరపున మదనపల్లి అసెంబ్లీ అభ్యర్థిగా నియోజకవర్గ నాయకులు రెడ్డిసాహెబ్ దరఖాస్తు చేసుకున్నట్లు తెలిపారు. విజయవాడలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయం ఆంధ్రరత్న భవన్‌లో బుధవారం ఆయన తన అభ్యర్థిత్వంకు సంబంధించిన దరఖాస్తును అందజేశారు.

డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులో పది రోజులు జైలుశిక్ష

ప్రజాశక్తి-పుల్లంపేట

మండల పరిధిలోని రామక్కపల్లె గ్రామానికి చెందిన గంధ్ర లక్ష్మీ నారాయణ మద్యం సేవించి మోటారు సైకిల్ నడపగా డ్రంక్ అండ్ డ్రైవ్ నిర్వహిస్తున్న పుల్లంపేట పోలీసులు పట్టుకొని నందలూరు మెజిస్ట్రేట్ ముందు హాజరు పరచగా న్యాయమూర్తి 10 రోజులు జైలు శిక్ష విధించారని ఎస్ఐ రఘు రాం తెలిపారు. లక్ష్మీనారాయణను రిమాండ్ నిమిత్తం రాజంపేట సబ్ జైలుకు తరలించినట్లు చెప్పారు. మద్యం సేవించి డ్రైవింగ్ నిర్వహిస్తే శిక్ష అర్హులన్నారు.

రెడ్డప్పరెడ్డి, సుమతి సేవలు ఎనలేనివి

ప్రజాశక్తి-తంబళ్లపల్లి

కాసువారిపల్లి పిహెచ్‌ఎస్ఇలో ఆప్తలజిస్ట్ డాక్టర్ రెడ్డప్పరెడ్డి, సిహెచ్ఒ సుమతి ఆరోగ్య శాఖ ద్వారా అందించిన సేవలు ఎనలేనివని డిప్యూటీ డిఎంహెచ్ఒ శ్రీలక్ష్మి పేర్కొన్నారు. కోసవారిపల్లి సిహెచ్‌సిలో వారు ఉద్యోగ విరమణ సందర్భంగా సన్మాన కార్యక్రమం నిర్వహించారు. విధి నిర్వహణలో వారు చూపిన చొరవ గ్రామీణ ప్రాంత ప్రజలకు అందించిన వైద్య సేవలు అజరామరమన్నారు. ప్రజలకు సేవలందించడంలో వారు ఎంతో ఓపికగా వైద్యం అందించారని పేర్కొన్నారు. వారిని శాలవావాతో సత్కరించారు. కార్యక్రమంలో డాక్టర్లు అనుపమ, ఆశాలత, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

వీధి బాలల పరిరక్షణకు కృషి

ప్రజాశక్తి-మదనపల్లి

వీధి బాలల నిర్మూలన దినోత్సవం సందర్భంగా స్థానిక చైతన్య స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో మండల న్యాయ సేవా సంస్థ న్యాయ విజ్ఞాన సదస్సును ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో మండల న్యాయశాఖకు చెందిన న్యాయవాదులు మీనా కుమారి, బాల జ్యోతి, పారా లీగల్ వాలంటీర్స్ కృష్ణమూర్తి బృందంతో చైతన్య స్వచ్ఛంద సేవా సంస్థను సందర్శించారు. కార్యక్రమంలో నిర్వాహకులు ఎంపీ ఆనందన్ మాట్లాడుతూ చైతన్య స్వచ్ఛంద సేవా సంస్థ 22 సంవత్సరాలుగా వీధి బాలలు మరియు నిరాధా రణకు గురైన పిల్లలను వెతికి వారికి కావలసిన విద్య, వైద్యం, ఆహారం, ఆరోగ్యం, వృత్తిరీత్యా విద్య నేర్పించి సమాజంలో స్వశక్తితో జీవించడం కోసం కావలసిన అన్ని రకాల సహాయ సహకారాలు అందజేస్తున్నదని తెలిపారు. న్యాయవాదులు మీనా కుమారి, బాలజ్యోతి మాట్లాడుతూ పిల్లలు వారి యొక్క హక్కులు మరియు వారికి ఏర్పాటు చేసిన చట్టాల గురించి తెలుసుకొని వాటిని సద్వినియోగపరచుకుంటూ భావి భారత పౌరులుగా ఎదగాలని తెలియజేశారు. భవిష్యత్తులో మండల న్యాయ సేవా సంస్థ వారు కూడా మరిన్ని అవగాహన సదస్సులు చేపడతారని తెలియజేశారు. పిల్లలకు గుడ్ టచ్ బ్యాడ్ టచ్ గురించి వినూతన రీతిలో అవగాహన ఏర్పరిచారు. కార్యక్రమంలో జనరల్ సెక్రటరీ ఎ.కవితా రాణి, చైతన్య స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో నడపబడుతున్న ముత్తు ఆంగ్ల మాధ్యమ పాఠశాల ఉపాధ్యాయులు గిరిజమ్మాల్, జనార్ధన, రెడ్డిశంకర్, రెడ్డిప్రసన్న, పి.మధు, గులాబ్ జాన్, చిన్నారులు పాల్గొన్నారు.

విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న న్యాయవాదులు

III JUEDGE BEFORE THE MOTOR ACCIDENT CLAIMS TRIBUNAL AT CHENNAI

M.C.O.P.NO. 3876 OF 2021

Minor Tejaswini, D/o. Jagannadham & 2 others .... Petitioners

-Vs-

1. Maneri Praveen Kumar
2. IFFCO TOKIO General Insurance Co-Ltd., ...Respondent

To

Maneri Praveen Kumar, S/o.Maneri Sreenivasulu
D.No. 9-105-3-H6, Penchupad Road,
Buggakalava, Madanapalli Res, School,
Madanapalli, Chittoor District,
Andhra Pradesh State 517 325

Please take notice that the above M.C.O.P.No.3875 of 2021 is posted for your appearance on 18.03.2024 at about 10.30a.m. Please be present before the above said Court on that day, failing which the matter will be decided in your absence.

T.Sathyamoorthi
Counsel for Petitioners

III JUEDGE BEFORE THE MOTOR ACCIDENT CLAIMS TRIBUNAL AT CHENNAI

M.C.O.P.NO. 3875 OF 2021

Minor Tejaswini, D/o. Jagannadham & 2 others .... Petitioners

-Vs-

1. Maneri Praveen Kumar
2. IFFCO TOKIO General Insurance Co-Ltd., ...Respondent

To

Maneri Praveen Kumar, S/o.Maneri Sreenivasulu
D.No. 9-105-3-H6, Penchupad Road,
Buggakalava, Madanapalli Res, School,
Madanapalli, Chittoor District,
Andhra Pradesh State 517 325

Please take notice that the above M.C.O.P.No.3875 of 2021 is posted for your appearance on 18.03.2024 at about 10.30a.m. Please be present before the above said Court on that day, failing which the matter will be decided in your absence.

T.Sathyamoorthi
Counsel for Petitioners

వైఎస్ఆర్ ఆసరా పొదుపు సంఘాలకు బాసట : ఎమ్మెల్యే

ప్రజాశక్తి - రాయచోటి టౌన్

వైఎస్ఆర్ ఆసరా పొదుపు సంఘాలకు బాసటగా నిలుస్తోందని ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్‌రెడ్డి అన్నారు. బుధవారం మండల కేంద్రమైన సంబేపల్లెలో నిర్వహించిన వైఎస్ఆర్ 4వ విడత చెక్కుల పంపిణీ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా ఆయన పాల్గొన్నారు. ఎంపిపి ఆవుల నాగశ్రీ లక్ష్మీ అధ్యక్షతన నిర్వహించిన సభలో ఆయన మాట్లాడుతూ జగనన్న పాదయాత్రలో అక్కాచెల్లెమ్మలకు ఇచ్చిన హామీలను నెరవేర్చుతున్నారన్నారు. ఎన్నికల సమయానిక కంతా డ్వాక్రా రుణాలను నాలుగువిడతలుగా మాఫీ చేస్తామని చెప్పి నేటికి సంపూర్ణంగా ఆ హామీని నెరవేర్చి మాట నిలబెట్టుకున్నారన్నారు. వైఎస్ ఆర్ ఆసరా ద్వారా రాయచోటి నియోజకవర్గంలో నాలుగు విడతల్లో రూ.108,97,16,863 మాఫీ అయ్యిందన్నారు. సంబేపల్లె మండలంలో వైఎస్ఆర్ నాల్గవ విడత కింద 543 సంఘాలకు రూ.4,63,56,968 లబ్ది చేకూరిందన్నారు. ఒక రాయచోటి నియోజకవర్గంలోనే 20 వేలకు పైగా పక్కా గృహాలు మంజూరు అయ్యాయన్నారు. చంద్రబాబు అధికారంలోనుంచి దిగిపోయేటప్పుడు రూ 3.50 లక్షల కోట్లను అప్పులుగాను, రూ 80 వేల కోట్ల రూపాయలను పెండింగ్ బకాయిలు పెట్టి వెళ్లారని, జగన్ అధికారంలోకి వచ్చిన తరవాత రెండేళ్ళ కరోనాతో ఆర్థిక ఇబ్బందులున్నా సంక్షేమ, అభివృద్ధి పథకాలను అందచేయడం జగన్ పరిపాలన దక్షతకు నిదర్శనమని కొనియాడారు. కార్యక్రమంలో డిసిఎంఎస్ మాజీ చైర్మన్ ఆవుల విష్ణువర్ధన్ రెడ్డి, మండల కన్వీనర్ ఉదయ్ కుమార్ రెడ్డి, రాయలసీమ విద్యాసంస్థల అధినేత ఆనందరెడ్డి, బసిరెడ్డి, మండల జెసి ఎస్ కన్వీనర్ ఉదయ్ కుమార్ రెడ్డి, వైస్ ఎంపిపి పొత్తూరి రవీంద్ర నాయుడు, డిసిసిబి డైరెక్టర్ సేర్ వెంకట్రామిరెడ్డి, వివి ప్రతాప్ రెడ్డి, అన్నారెడ్డి, మండల వ్యవసాయ సలహా మండలి అధ్యక్షుడు వాసుదేవ రెడ్డి, మాజీ వైస్ ఎంపిపి నాగారంజాన్ వలీ, సర్పంచులు అంచల రామచంద్ర,పూజల అలివేలమ్మ నాగరాజు యాదవ్, బొద్దికొండ హసీనా నూర్, అమరనాథ రెడ్డి, దండు నాగభూషన్ రెడ్డి, వెంకట రమణ నాయక్, పాల వెంకట రమణ నాయుడు, యువరాజు నాయుడు, ఎంపిటిసిలు రాజకుమారి, భద్రయ్య, కాకులపల్లె రమణారెడ్డి, రామరాజు, రఘు, మీసాల ఆంజనేయులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి

'ఉద్యోగ విరమణ తప్పనిసరి'


పీలేరు : ఎస్‌డిసి దంపతులను సత్కరిస్తున్న తహశీల్దారులు

ప్రజాశక్తి-పీలేరు

వృత్తి ధర్మాన్ని పాటిస్తూ దానికే మొదటి ప్రాధాన్యత నిచ్చే స్వభావం ఏ కొద్ది మందికి మాత్రమే ఉంటుందని, అలాంటి వారిలో పీలేరు స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ కె.గోపాలకృష్ణ ఒకరని వక్తలు తమ అభిప్రాయాలను వ్యక్తం చేశారు. స్థానిక హంద్రీ-నీవా, సుజల స్రవంతి ప్రాజెక్టు-2 స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ ఉద్యోగ విరమణ కార్యక్రమం స్థానిక ఆర్ఆర్ రెసిడెన్సీలో జరిగింది. ఈ సందర్భంగా కార్యక్రమానికి హాజరైన పలువురు అతిథులు ఆయనను ఉద్దేశించి మాట్లాడుతూ విధుల పరంగా తన కింది స్థాయి ఉద్యోగులు ఎవరినీ నొప్పించకుండా తాను అనుకున్నది సాధించడంలో గోపాలకృష్ణ దిట్ట అని పలువురు కొనియాడారు. స్థానిక స్పెషల్ డిప్యూటీ కలెక్టర్‌గా ఆయన ఏడాది కాలం మాత్రమే పనిచేసినప్పటికీ తన విధులతోపాటు పీలేరు నియోజకవర్గ ఓటర్ల నమోదు అధికారిగా తన పరిధిలోని ఆరు మండలాల రెవెన్యూ అధికారులు, బిఎల్ఒలను సమన్వయం చేసుకుంటూ, తనకు కేటాయించిన పనుల్లో తప్పులు దొర్లకుండా వాటిని సకాలంలో పూర్తి చేయడంలో కృతార్థులయ్యారన్నారు. ఎఎస్ఒ రామ్మోహన్ పరిచయకర్తగా వ్యవహరించిన ఈ కార్యక్రమంలో అనంతరం స్పెషల్ డిప్యూటీ కలెక్టరును స్థానిక రెవెన్యూ ఉద్యోగులతో పాటు వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన విశ్రాంత ఉద్యోగులు, ఉద్యోగులు ఎస్‌డిసి దంపతులను సన్మానించి, బహుమతులతో సత్కరించారు. కార్యక్రమంలో పీలేరు రెవెన్యూ ఉద్యోగుల తో పాటు కలకడ, గుర్రంకొండ, వాల్మీకిపురం, కలికిరి, కెవి పల్లి మండలాల తహశీల్దారులు ప్రదీప్, ఖాజాబీ, ఫిరోజ్ ఖాన్, భాగ్యలత, నరసింహులు, పీలేరు ఎంపీడీవో డాక్టర్ మురళీమోహన్ రెడ్డి సూపరింటెండెంట్ సతీష్, బోడుమల్లువారిపల్లి సచివాలయ కార్యదర్శి హరిప్రసాద్ పాల్గొన్నారు. **లక్కిరెడ్డిపల్లి :** ప్రతి ప్రభుత్వ ఉద్యోగికి ఉద్యోగ విరమణ అనేది తప్పనిసరి జిల్లా అగ్నిమాపక అధికారి సునీల్ కుమార్ పేర్కొన్నారు. లక్కిరెడ్డిపల్లి ఫైర్ ఆఫీసులో ఫైర్ ఆఫీసర్‌గా పనిచేస్తున్న బాల హుసేనయ్య ఉద్యోగ విరమణ సందర్భంగా ముఖ్య అతిథిగా ఆయన హాజరై బాల హుసేనయ్యను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో రాయచోటి, కలకడ, కడప, రాజంపేట, పోరుమామిళ్ల, రైల్వేకోడూరు ఫైర్ ఆఫీసర్లు హాజరయ్యారు. వెంకటరామిరెడ్డి, సుభహాన్, నాగేశ్వరరావు, సునీల్, సాయి చంద్ర అగ్నిమాపక సిబ్బంది పాల్గొన్నారు.

పంటల్లో తెగుళ్ల నివారణపై రైతులకు అవగాహన

ప్రజాశక్తి-పుల్లంపేట

మండలం రెడ్డిపల్లి గ్రామ పంచాయతీ లోని చీనీ, నిమ్మ పంటలను అనంతరాజుపేట ఉద్యాన కళాశాల తెగుళ్ల విభాగం శాస్త్రవేత్త డాక్టర్ కె.దినేష్, రైల్వేకోడూరు ఉద్యాన అధికారి ఎం.భాస్కర్ బుధవారం సందర్శించారు. ఈ సందర్భంగా రైతులతో వారు మాట్లాడుతూ చీనీ, నిమ్మ తోటలలో అధికంగా ఆశించే సిట్రస్ గ్రీనింగ్, గజ్జి తెగులు, వైరస్ వ్యాధుల గురించి ఉద్యాన రైతులకు అవగాహన కల్పించారు. తెగులు నివారణ, మంచి నాణ్యతతో కూడిన పంట దిగుబడుల ద్వారా అధిక రాబడి సాధించడానికి చేపట్టవలసిన సస్యరక్షణ, సమగ్ర యాజమాన్య పద్ధతులను తెలియజేశారు. ఈ మధ్యకాలంలో చీనీ, నిమ్మ పంటలలో సిట్రస్ గ్రీనింగ్ వ్యాధి ఉధృతి ఎక్కువగా ఉందని పేర్కొన్నారు. ఈ వ్యాధి వాహకం అయినటువంటి డయాఫోరిన సిట్రి (సిల్లిడ్)ని అరికట్టడానికి చేపట్టవలసిన నివారణ చర్యలను రైతులకు సూచించామని పేర్కొన్నారు. ఈ తెగుళ్లు అంటు మొక్కల ద్వారా, విత్తనాల ద్వారా వ్యాపిస్తుంది కాబట్టి మొక్కలు ఎంపికలో తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచనలు చేశారు. రిజిస్టర్డ్ నర్సరీస్ నుండి మాత్రమే మొక్కలను కొనుగోలు చేయాలని తద్వారా అధిక రాబడులను పొందవచ్చని తెలియజేశారు. నర్సరీల నుంచి మొక్కలు కొనుగోలు చేసే సమయంలో బిల్లులను కచ్చితంగా తీసుకోవాలని రైతులకు వారు సూచించారు. నష్టం జరిగినప్పుడు ఉపయోగపడతామని చెప్పారు. కార్యక్రమంలో రెడ్డిపల్లి గ్రామ సర్పంచ్, గ్రామ ఉద్యాన సహాయకులు, ఉద్యాన రైతులు పాల్గొన్నారు.

చీనీ చెట్లను పరిశీలిస్తున్న ఉద్యానవన అధికారులు

'బడుగు బలహీన వర్గాల సత్తా చాటుదాం'

రామాపురం : ప్రజలకు కరపత్రాలు పంపిణీ చేస్తున్న ఆనంద్

ప్రజాశక్తి-లక్కిరెడ్డిపల్లి

రాబోయే సార్వత్రిక ఎన్నికలు 2024లో బడుగు బలహీన వర్గాల సత్తా చాటుదామని రాజంపేట పార్లమెంట్ ఎంపీ స్వతంత్ర అభ్యర్థి తుర్ల ఆనంద్ యాదవ్ పేర్కొన్నారు. బుధవారం లక్కిరెడ్డిపల్లిలో ప్రచార కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నోటుకు ఓటు స్వస్తి పలకాలని పెత్తనం దారులకు నిరుపేదల సత్తా చూపించాలన్నారు. ప్రజలు ఆశీర్వదిస్తే గెలిపిస్తే రైతులు పండించిన పంటకు గుట్టుబాటు కల్పించిన కృషి చేస్తానని తెలిపారు. మదనపల్లి, రాయచోటి ప్రాంతంలో పండించే టమోటా ఆధారిత పరిశ్రమంలో నెలకొల్పడానికి కృషి చేస్తానని చెప్పారు. న్యాయవాదులకు పక్కా ఇళ్లు నిర్మిస్తామని, జర్నలిస్టులకు వైద్య ఖర్చులకు రూ.నాలుగు లక్షలు నిధులు మంజూరు కృషి చేస్తానని తెలిపారు. ప్రతి అసెంబ్లీ నియోజకవర్గంలో నిరుద్యోగుల కొరకు పరిశ్రమలు ఏర్పాటుకు కృషి చేస్తామని పేర్కొన్నారు. **రామాపురం :** త్వరలో నిర్వహించబోయే ఎన్నికల్లో రాజంపేట స్వతంత్ర అభ్యర్థిగా తుర్లు ఆనందయాదవ్ బరిలో నిలిచారు. రామాపురంలో సాయంత్రం ఆయన బిసి కులాల చెందిన ప్రజలను కలిసి కలిశారు. ఈ సందర్భంగా స్వతంత్ర అభ్యర్థిగా రాజంపేట ఎంపీ బరిలో ఉన్నట్లు స్పష్టం చేస్తూ కరపత్రాలు పంపిణీ చేశారు. సందర్భంగా ఆయన మాట్లాడుతూ తాను ఎపి యాదవ్ సంఘం రాష్ట్ర అధ్యక్షులుగా పని చేశానన్నారు. తాను వృత్తి రీత్యా 20 సంవత్సరాలుగా మదనపల్లిలో న్యాయవాది వృత్తిలో పనిచేస్తున్నానని ఆయన తెలిపారు. రాజకీయాలలో అవినీతిని నిర్మూలించే దిశగా బడుగు బలహీన పేద వర్గాల సంక్షేమానికి నిర్విరామ కృషి చేయడానికి రాజకీయాల్లో పోటీలో నిలబడుతున్నానని ఆయన తెలిపారు. తాను ఎంపీగా విజయం సాధిస్తే రాజంపేట పార్లమెంట్ పరిధిలోని అన్ని నియోజకవర్గాలలో పేద విద్యార్థులకు ఉచిత కోచింగ్ సెంటర్‌ను శాశ్వతంగా ఏర్పాటు చేస్తామన్నారు. రైతుల పండించే పంటలకు గిట్టుబాటు ధర వచ్చే విధంగా కృషి చేస్తానన్నారు. తాను జాతీయ పార్టీలను కానీ, ప్రాంతీయ పార్టీలను కానీ కలవనన్నారు. కార్యక్రమంలో నవీన్ యాదవ్. అరుణ కుమార్ యాదవ్. రహీం. నరేష్ కుమార్ పాల్గొన్నారు

ఘనంగా 'కసిరెడ్డి' పుట్టినరోజు వేడుకలు

ప్రజాశక్తి-గాలివీడు

వైసిపి యూత్ నాయకులు కసిరెడ్డి వెంకటశివారెడ్డి పుట్టిన రోజు వేడుకలు ఘనంగా నిర్వహించారు. బుధవారం సాయంత్రం తన స్వగృహంలో 40వ జన్మదినోత్స వేడుకలను కుటుంబ సభ్యుల, స్నేహితుల నడుమ చేసుకున్నారు. కేక్ కట్ చేసి అందరికీ పంచిపెట్టారు. అనంతరం విందుభోజనం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పెద్ద ఆశీస్సులు, దీవెనలతో పుట్టిన రోజు వేడుకలు నిర్వహించుకోవడం సంతోషంగా ఉందన్నారు. తాను ఎన్నో సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నానని చెప్పారు. వెలిగల్లు నుంచి ఇడుపులపాయ వైఎస్ఆర్ ఘాట్ వరకు పాదయాత్ర నిర్వహించి మండలంలో ప్రజాధరణ పొందానని చెప్పారు. యువకులకు, క్రీడలకు మంచి ప్రోత్సాహానిస్తున్నానని తెలిపారు. కష్టాల్లో ఉన్నవారిని ఎప్పుడైనా ఆదుకునేందుకు సిద్ధంగా ఉన్నానని ఆయన పేర్కొన్నారు.

పాడిపంటలతో సుభిక్షంగా ఉండాలి : పెద్దిరెడ్డి

ప్రజాశక్తి-తంబళ్లపల్లి

మండలంలోని జుంజరపెంట పంచాయతీలో వెలసిన శ్రీ కోదండరామస్వామి ఆలయంలో సర్పంచ్ భూదేవి, చంగల్ రాయుడు ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు జరిగాయి. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథ్‌రెడ్డి హాజరయ్యారు. ఎమ్మెల్యేకి ద్విచక్ర వాహనాల ర్యాలీతో పెద్ద ఎత్తున ర్యాలీ చేస్తూ స్వాగతం పలికారు. ఆలయంలో స్వామివారికి ఎమ్మెల్యే ప్రత్యేక పూజలు చేశారు. నియోజకవర్గం పాడిపంటలతో కళకళలాడుతూ ప్రజల ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని స్వామివారికి మొక్కుకున్నారు. అనంతరం జరిగిన బహిరంగ సభలో ఎమ్మెల్యే మాట్లాడుతూ గతంలో ప్రజలు జగన్మోహన్‌రెడ్డిని నమ్మి ఎంతో పెద్ద మెజారిటీతో ముఖ్యమంత్రిని చేసిన ఘనత ఆంధ్ర ప్రజలదేనన్నారు. ఆ నమ్మకాన్ని వమ్ము చేయకుండా ముఖ్యమంత్రి కులమతాలకు రాజకీయ పార్టీలకు అతీతంగా అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలను ఇంటికి అందించిన ఘనత ముఖ్యమంత్రిదేనన్నారు. తంబళ్లపల్లి నియోజకవర్గంలో ముఖ్యమంత్రికి ఓ ప్రత్యేక గుర్తింపు ఉందన్నారు. అది ప్రజలు ఇచ్చిన మెజారిటీనేనని పేర్కొన్నారు. కార్యక్రమంలో సింగల్ విండో చైర్మన్ భార్గవ రెడ్డి, మల్లయ్య కొండ చైర్మన్ మల్ రెడ్డి, నాయకులు రామకృష్ణ, మల్లికార్జున, కోటిరెడ్డి, శివారెడ్డి, భాస్కర్ రెడ్డి, రమణారెడ్డి పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథ్‌రెడ్డి

ఆరోగ్య శ్రీ కార్డులను పంపిణీ చేస్తున్న నిస్సార్ అహమ్మద్

ఆరోగ్యశ్రీ కార్డులు పంపిణీ

ప్రజాశక్తి-మదనపల్లి

పట్టణంలోని 14వ వార్డు కౌన్సిలర్ షబానా కరీముల్లా అధ్యక్షతన కొత్త ఆరోగ్యశ్రీ కార్డుల పంపిణీ చేశారు. మదనపల్లి నియోజకవర్గం వైసిపి సమన్వయకర్త నిసార్ అహ్మద్ పాల్గొని లబ్ధిదారులకు అందజేశారు. కార్యక్రమంలో అన్నమయ్య జిల్లా వక్ఫ్ బోర్డు చైర్మన్ కరీముల్లా, మున్సిపల్ చైర్‌పర్సన్ మనూజ కిరణ్‌రెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్ జింక వెంకటాచలపతి దేవత సతీష్, కౌన్సిలర్లు గాంధీ, ముబీన సలీం, సాయి, నరేంద్ర, సుగుణ అంజి, శివయ్య, వార్డు ప్రజలు పాల్గొన్నారు.

అనారోగ్యంతో మాజీ జడ్‌పిటిసి మృతి

ప్రజాశక్తి-ములకలచెరువు/బి.కొత్తకోట

పిటిఎం మాజీ జడ్‌పిటిసి కృష్ణారెడ్డి అనారోగ్యంతో మంగళవారం రాత్రి మృతి చెందారు. బుధవారం ప్రముఖ పారిశ్రామికవేత్త టిడిపి నేత దాసిరిపల్లి జయచంద్రారెడ్డి బూర్లపల్లిలోని కృష్ణారెడ్డి, మాజీ ఎంపిపి పాగొండ ఖలీల్ అహ్మద్ భౌతిక కాయాన్ని సందర్శించి ఘనంగా నివాళులర్పించారు. కుటుంబ సభ్యులు తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. నివాళులర్పించిన వారిలో నాయకులు ఆంజనేయరెడ్డి, బి.శంకర్‌రెడ్డి, మంత్రి గిరిధర్‌రెడ్డి, బి.వి.రెడ్డి, రాజశేఖర్‌రెడ్డి, దాదం లోకనాథరెడ్డి, శివరాంరెడ్డి, మగ్గాల భాస్కర్, ఫజులుల్లా, హరి, రాయల్ అరుణ్, శివ, రియాజ్, గౌరీ శంకర్ ఉన్నారు.

నిజాముద్దీన్‌ను సన్మానిస్తున్న ఎంపిపి మేడా విజయభాస్కర్‌రెడ్డి

టంగుటూరు ముస్లిం కమిటీ ప్రెసిడెంట్‌గా నిజాముద్దీన్

ప్రజాశక్తి-నందలూరు

మండలంలోని టంగుటూరు గ్రామంలో నిర్వహించిన ముస్లిం కమిటీ సమావేశంలో నూతన ముస్లిం కమిటీ ప్రెసిడెంట్‌గా సయ్యద్ నిజాముద్దీన్, సెక్రెటరీగా షేక్‌తాజుద్దీన్‌ను సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఎన్నికైన ప్రెసిడెంట్, సెక్రటరీలు బుధవారం ఎంపిపి మేడా విజయ భాస్కర్‌రెడ్డిని ఆయన స్వగృహంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మేడా విజయభాస్కర్‌రెడ్డి, ప్రెసిడెంట్ నిజాముద్దీన్, సెక్రటరీ తాజుద్దీన్‌లను ఘనంగా సన్మానించి సత్కరించారు. ఈ సందర్భంగా ఎంపిపి మాట్లాడుతూ కమిటీ అభివృద్ధికి తన సహాయ సహకారాలు ఎల్లవేళలా అందజేస్తామని తెలిపారు. కార్యక్రమంలో మండల వైసిపి అధ్యక్షులు అన్నం నాగేంద్ర మూర్తి, జిల్లా వక్ఫ్ బోర్డ్ ప్రధాన కార్యదర్శి సయ్యద్ అమీర్, జిల్లా మైనార్టీ సెల్ చైర్మన్ సయ్యద్ జుల్ఫికర్, సర్పంచ్ షేక్ మైనుద్దీన్, స్థానిక నాయకులు షేక్ మహమ్మద్ గౌస్, షేక్ షాబురు, మీనిగ నాగభూషణం, రాంబాబు, షేక్ మన్సూర్, షేక్ తోషిద్, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

కంటి ఆపరేషన్ చేసుకున్న వారితో చైర్మన్ భాస్కర్‌నాయుడు

19 మందికి ఉచిత కంటి ఆపరేషన్లు

ప్రజాశక్తి-మదనపల్లి

మదనపల్లె లయిన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో 19 మందికి ఉచిత క్యాటరాక్ట్ ఆపరేషన్లు నిర్వహించినట్లు అధ్యక్షులు డాక్టర్ అప్పినపల్లి భాస్కరాచారి తెలిపారు. లయన్స్ కంటి వైద్యులు డాక్టర్ నివేదిత కంటి శస్త్రచికిత్సలు చేశారన్నారు. బుధవారం స్థానిక లయన్స్ కంటి ఆసుపత్రిలో 19 మందికి ఉచిత క్యాటరాక్ట్ ఆపరేషన్లు చేశామన్నారు. ఈ సందర్భంగా భాస్కరాచారి మాట్లాడుతూ అంధత్వాన్ని రూపుమాపడమే లక్ష్యంగా మదనపల్లి లయిన్స్ క్లబ్ ముందుకు సాగుతున్నదని స్పష్టం చేశారు. గ్రామాల్లోని పేద కుటుంబాలలో అంధత్వంతో ఇబ్బంది పడుతున్న వారికి అది సమస్య కాకుండా చూడాలనే ఉద్దేశ్యంతో లయిన్స్ క్లబ్ సేవలను అందిస్తోందని పేర్కొన్నారు. విరివిగా కంటి పరీక్ష శిబిరాలను ఏర్పాటు చేసి అందులో కంటిలో శుక్లము వున్న వారిని చూపు మందగించిన వారిని గుర్తించడం జరుగుతోందని చెప్పారు. వారికి లయన్స్ కంటి ఆసుపత్రిలో ఉచితంగా నిపుణులైన వైద్యులు చే శస్త్రచికిత్సలు చేస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో ఎంజె ఎఫ్‌పిఆర్ఒ లయన్ గౌతమ్ రెడ్డి, లయిన్స్ కంటి ఆసుపత్రి చైర్మన్ భాస్కర్ నాయుడు, మహేష్, హాస్పిటల్ సిబ్బంది పాల్గొన్నారు.

టిడిపిలో 25 కుటుంబాలు చేరిక

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

తెలుగుదేశం పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బత్యాల చంగల్ రాయుడు సమక్షంలో వారి చేతుల మీదుగా కండువా వేయించుకుని బుధవారం రాజంపేట టిడిపి కార్యాలయంలో నందలూరు మండలం చుక్కాయపల్లి గ్రామస్తులు చుక్కా నరసింహులు, చుక్కా కోటయ్య ఆధ్వర్యంలో వైసిపి శ్రేణులు చుక్కా శ్రీనివాసులు, తోకల వెంకటేష్, తోకల వెంకటయ్య, తోకల శ్రీనివాసులు, కడప వెంకటయ్య, కోనేటి సుబ్బరాయుడు, చుక్కా పెద్దవెంకటేష్, చుక్కా చిన్నవెంకటేష్‌తో పాటు దాదాపు 25 కుటుంబాలు స్వచ్ఛందంగా వైసిపి వీడి టిడిపిలోకి చేరారు. ఈ సందర్భంగా వైసిపిని వీడి టిడిపిలోకి చేరిన శ్రేణులు మాట్లాడుతూ వైసిపి నాయకులు తమకు మాయమాటలు చెప్పి తమ సమస్యలను కూడా పెడచెవిన పెడుతూ సుమారు నాలుగు సంవత్సరాల ఏడు నెలలు కాలయాపన చేశారని పేర్కొన్నారు. ఎంతసేపు వైసిపి నాయకులు వారి స్వార్థాన్ని చూసుకుంటూ భూకబ్జాలు, అక్రమ ఇసుక మాఫియా చేస్తూ, ప్రశ్నించిన వారిపై అక్రమ కేసులు బనాయిస్తూ దౌర్జన్యంగా వ్యవహరిస్తున్నారని తెలిపారు. వైసిపి నాయకులపై పూర్తిగా విశ్వాసం కోల్పోయామని చెప్పారు. అందుకే వైసిపిని వీడి టిడిపిలో చేరామని తెలిపారు. కార్యక్రమంలో పలువురు తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

టిడిపి చేరిన చుక్కాయిపల్లె గ్రామస్తులతో బత్యాల చెంగల్రాయుడు